క్లుప్తంగా

పేకాట రాయుళ్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

సోమందేపల్లి: మండలంలో పేకాట ఆడుతున్న 17 మంది జూదరులకు ఆదివారం పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద జూదరులను పిలిపించి ఎస్ఐ రమేష్ బాబు బైండోవర్ చేశారు. పేకాట వలన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడతాయని, కాబట్టి జూదానికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. భవిష్యత్తులో మరోసారి పట్టుబడితే బైండోవర్ కేసులో భాగంగా రూ.లక్ష జరిమానా కట్టాల్సి ఉంటుందన్నారు. నిరంతరం నిఘా ఉంచామని ఎక్కడైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సేవామందిరంలో చోరీ

పరిగి: మండలంలోని సేవా మందిరంలో గత శనివారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు ఆర్పీజీటీ లేఅవుట్‌లో ఉంటున్న టీచర్ పవిత్ర, రామచంద్ర దంపతుల ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో దాచిన నాలుగు తులాల బంగారాన్ని అపహరించారు. గత శనివారం పుట్టపర్తిలో జరిగిన టీచర్ల బదిలీలకు వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదర్శన



అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత గుడ్డం రంగనాథస్వామి

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయ గిరి ప్రదర్శన కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామికి పంచామృతాభిషేకం చేశారు. విశేష పుష్పాలంకరణతో అర్చనలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి ఉత్సవ మూర్తులను పూలరథంలో కొలువుదీర్చడంతో పాటు పూజలు చేశారు. భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ గిరి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మంగళ హారతులిచ్చి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగేంద్ర, అర్చకులు గోవిందశర్మ, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత 'శ్రీరంగరాజుపల్లి'



విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న దృశ్యం

పరిగి: మండల కేంద్రం పరిగిలో జరుగుతున్న ఛత్రపతి శివాజీ వాలీబాల్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం పరిగి – శ్రీరంగరాజుపల్లి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఇందులో భాగంగానే శ్రీరంగరాజుపల్లి జట్టు విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్‌లో మొత్తం 8 జట్లు పాల్గొన్నాయని బంగారు చంద్ర తెలిపారు. విజేత జట్టు అయిన శ్రీరంగరాజుపల్లికి రూ.5 వేలు, రన్నరప్‌గా నిలిచిన పరిగి జట్టుకు రూ.3 వేల నగదుతో పాటు ట్రోఫీలను అందించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించుకోవాలని సూచించారు. ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు తప్పని సరిగా హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించాలన్నారు.

ఘనంగా గంధం వేడుక



గంధం మోసుకెళ్తున్న సలావుద్దీన్‌బాబా

పెనుకొండ: పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున చిన్న బాబయ్య స్వామి గంధం వేడుకలు ఘనంగా జరిగాయి. బాబయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా కుమారుడు సలావుద్దీన్ బాబాతో కలసి తన ఇంటి వద్ద నుంచి గంధాన్ని తలపై ఉంచుకుని బాబయ్య స్వామి సమాధి వద్దకు తీసుకెళ్లి గంధాన్ని స్వామి వారికి సమర్పించారు. అనంతరం స్వామి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మలుపు.. ప్రమాదానికి పిలుపు



అక్కంపల్లి మలుపులో డ్రైనేజీలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్ (ఫైల్)



మెట్టబండ పాళ్యం క్రాస్‌లో బోల్తాపడిన ట్రాక్టర్ (ఫైల్)

మడకశిరరూరల్: నియోజకవర్గంలోని మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం మండలాల్లోని పలు గ్రామాల్లో రోడ్డు మలుపులు ప్రమాదానికి కారణంగా మారుతున్నాయి. మలుపుల వద్ద తరచూ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు అదుపుతప్పి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మడకశిర మండలంలోని ఎల్లోటి రహదారి మలుపు, చెందకచెర్లు క్రాస్, మెట్టబండ పాళ్యం, అక్కంపల్లి తదితర రోడ్డు మలుపుల్లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మడకశిర నుంచి గుండుమల రోడ్డు మలుపులు ఎక్కువగా ఉండడంతో ఎస్‌రాయాపురం, ఎస్ఎస్‌గుండ్లు, గుండుమల, కోతులగుట్ట, జక్కేపల్లి, సిద్దగిరి తదితర గ్రామాలకు చెందిన ద్విచక్ర వాహనచోదకులు మలుపు వద్ద అదుపు తప్పి తీవ్రంగా గాయాలపాలవున్నారు. అక్కంపల్లి గ్రామ మలుపులో గతంలో ట్రాక్టర్ డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం త్రుటిలో తప్పింది. మెట్టబండ పాళ్యం క్రాస్‌లో కూడా గతంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ఇతర మండలాల్లో కూడా గ్రామాలకు వెళ్లే రోడ్డులో మలుపులతో ప్రమాదం పొంచి ఉంది. విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు వచ్చి వెళ్తుంటారని, ఈ మలుపుల వద్ద ప్రమాదం జరగకుండా సంబంధిత అధికారులు రోడ్డు మలుపు వద్ద రోడ్లను వెడల్పు చేసి ప్రమాదాలు జరగకుండా నివారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



మెట్టబండ పాళ్యం వద్ద ప్రమాదకరమైన రోడ్డు మలుపు

రోడ్డును వెడల్పు చేయాలి



మండల పరిధిలోని మెట్టబండ పాళ్యం వద్ద రోడ్డు మలుపుతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అందువల్ల వెంటనే ఇక్కడ రోడ్డును వెడల్పు చేయాలి. గతంలో మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. అయితే ఆ సమయంలో ఎవరూ అటుగా రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని మలుపు రోడ్డును వెడల్పుకు చర్యలు చేపట్టాలి.

– మల్లికార్జున, కోతులగుట్ట, మడకశిర మండలం

ప్రమాదాలు నివారించాలి



మండలంలోని వివిధ గ్రామాల రోడ్డు మలుపుల వద్ద జరుగతున్న ప్రమాదాలను గుర్తించి సంబంధిత అధికారులు రోడ్డు మలుపును వెడల్పు చేసి ప్రమాదాలు నివారించాలి. గతంలో గౌడనహళ్లి సమీపంలోని చందకచెర్లు క్రాస్‌లో మలుపు వద్ద ఒకరు మృతి చనిపోయారు. సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకొని రోడ్డు మలుపులో ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– నరసింహ, గౌడనహళ్లి, మడకశిర మండలం

షరతుల్లేకుండా తల్లికి వందనం అమలు చేయాలి

• వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక



చిలమత్తూరు: ఎలాంటి షరతులు లేకుండా విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక డిమాండ్ చేశారు. షరతుల పేరుతో పేద పిల్లలకు అన్యాయం జరుగుతోందన్నారు. రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.13 వేలు మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు. 300 యూనిట్లు విద్యుత్ వాడకం, చిరుద్యోగులు, సర్పంచుల బిడ్డలకు పథకం వర్తింపజేయకపోవడం సిగ్గు చేటన్నారు. రూ.10 వేలు, రూ.12 వేలు జీతాలు తీసుకునే చిరుద్యోగులకు కుటుంబ పోషణ కూడా కష్టంగా ఉంటుందని, అలాంటి వారికి పథకాన్ని రాకుండా చేయడమేంటని ప్రశ్నించారు. ప్రతి ఒక్క విద్యార్థికీ తల్లికి వందనం పథకం అందేలా చూడాలన్నారు. అలా చేయలేకపోతే సూపర్ సిక్స్‌లో తల్లికి వందనం అసంపూర్ణమన్నారు. ఇప్పటికీ చాలా మంది తల్లుల ఖాతాలకు నగదు జమ కాలేదన్నారు. ఏడాది గడిచిన తర్వాత అయినా తల్లికి వందనం నగదు వస్తోందని సంబరపడిన విద్యార్థుల తల్లిదండ్రులకు చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ గట్టి షాక్ ఇచ్చారన్నారు. అలాగే ఖరీఫ్ ముంచుకొస్తోందని, పంటల సాగుకు చేతిలో డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతుకు సాయం కింద రూ.20 వేలు ఇప్పటిదాకా రైతులకు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలన్నారు. పథకాలు ఇచ్చినట్టే ఇచ్చి ఎన్నో షరతులు విధించి మోసం చేస్తున్నారని, ఎవరూ సూపర్ సిక్స్ గురించి మాట్లాడకూడదని చంద్రబాబు హెచ్చరించడం చూస్తుంటే విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే నిబంధనలను సడలించి పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపాలన్నారు.

'పురం'లో ఐటీ పరిశ్రమలు స్థాపించాలి



మాట్లాడుతున్న జెవీవీ అధ్యక్షుడు రామకృష్ణ

హిందూపురం: హిందూపురంలో ఐటీ పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఐటీ పురంగా అభివృద్ధి చేయాలని జన విజ్ఞాన వేదిక కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బాలకృష్ణకు విన్నవించారు. ఆదివారం ఎన్జీఓ హోంలో జెవీవీ అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన జన విజ్ఞాన వేదిక కమిటీ సమావేశం జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ హిందూపురం నుంచి ఏటా 3, 4 వేల మంది గ్రాడ్యుయేట్లు ఇతర ప్రాంతాలకు ఉద్యోగ అవకాశాలకు వెళ్తున్నారన్నారు. బెంగళూరు, దేవనహళ్లి అంతర్జాతీయ విమానానికి సమీపంలో ఉండటంతో ఐటీ పరిశ్రమల స్థాపనకు అనుకులంగా ఉందన్నారు. మలుగూరు, పాలసముద్రం ప్రాంతాల్లో ఐటీ పరిశ్రమల కోసం ప్రభుత్వం 5 వేల ఎకరాల సర్వే చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపి ఐటీ పరిశ్రమలు హిందూపురం ప్రాంతంలో స్థాపించేలా చొరవ చూపించాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, అతావుల్లా, వెంకటరామిరెడ్డి, ఉగ్రప్ప, చైతన్యగంగిరెడ్డి, లక్ష్మిపతి, చంద్రశేఖర్, నాగరాజగుప్త, అంజనరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత



సర్పంచ్ నాగమూర్తి అక్రమంగా తన ఇంటి ముందు చేపట్టిన నిర్మాణం

పెనుకొండ రూరల్: మండలంలోని కురుబవాండ్లపల్లిలో సర్పంచ్ నాగమూర్తి ఇందిరమ్మ కాలనీలో ఇంటిని నిర్మించుకున్నారు. అయితే తన ఇంటి ముందు ఖాళీ ప్రదేశాన్ని కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వివాదాస్పదంగా మారింది. ఇప్పటికే స్థానికులు దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిర్మాణాన్ని వారు అడ్డుకున్నారు. అయితే స్థలానికి సంబంధించి పత్రాలు ఉన్నాయా అని అధికారులు ప్రశ్నించగా.. తహసీల్దార్‌తో మాట్లాడతానని సర్పంచు పేర్కొనడం గమనార్హం. అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన సర్పంచు ఇలా ఆక్రమణలకు దిగితే ఎలా అని స్థానికులు మండిపడుతున్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



అలంకరణలో శ్రీనివాస సమేత శ్రీదేవి, భూదేవి

లేపాక్షి: స్థానిక పాతూరు తిరుమలదేవరప్ప (వెంకటరమణస్వామి) దేవాలయంలో ఆదివారం శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. వెంకటరమణస్వామి, పద్మావతి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు సంప్రదాయబద్ధంగా కల్యాణోత్సవాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగించండి



రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు

అమరాపురం: మండల పరిధిలోని వీరాపురం నుంచి అమరాపురం గ్రామానికి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంప చెట్లను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కంప చెట్లతో అటుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు చేస్తున్న దృశ్యం

హిందూపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా థెరపీ నిర్వాహకులు బద్రీనారాయణ, మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్‌కుమార్ అన్నారు. యోగా మాసోత్సవాల్లో భాగంగా వివేకానంద యోగా థెరపీ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం గుడ్డం రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. భుజంగాసనం, దండాసనం, గరుడాసనం తదితర ఆసలు వేయించారు. అనంతరం యోగ సాధన, యోగా విధానాలతో ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కరే రమేష్, మల్లికార్జున, లక్ష్మీనారాయణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కియా దగ్గర..

పెనుకొండ రూరల్: కియా పరిశ్రమ ఆవరణలో సోమవారం పెనుకొండ డివిజన్‌కు సంబంధించి యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి సవిత, కలెక్టర్ చేతన్ హాజరవుతారన్నారు. ఉదయం 6 గంటల నుంచి 8 వరకూ నిర్వహించే యోగాంధ్ర జరిగే కార్యక్రమంలో ఉద్యోగులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



కౌన్సిలర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి పార్టీ నేతలకు సూచించారు. ఆదివారం ఆయనపట్టణంలోని కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులతో సమావేశాన్ని నిర్వహించారు. నిత్యం ప్రజల్లో ఉండి వారి సమస్యలపై పోరాడితేనే రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో పట్టు సాధించగలమన్నారు. మున్సిపాలిటీలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి గుర్తించి సమస్యలు పరిష్కరించేలా అధికారులపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. మున్సిపాలిటీలో నిధులు దుర్వినియోగం జరుగుతున్నాయని, అవినీతి తాండవం చేస్తోందన్నారు. టీడీపీ నేతల అవినీతిని బయటపెట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆసిఫ్, రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ఏ శివ, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్ గౌడ్, రాష్ట్ర యువజన విభాగం ఉప కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకటనాగేంద్రబాబు, మల్లికార్జున, రోషన్ అలీ, షాజియా, మద్దెన జయరాములు, నాగరాజు, కో ఆప్షన్ సభ్యులు సువర్ణమ్మ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

పావగడ: పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ సంబంధిత ఇంజినీర్లు, కాంట్రాక్టర్లకు సూచించారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో రూ.4 కోట్ల నిధులతో నిర్మించనున్న నూతన గదుల నిర్మాణానికి భూమి చేశారు. అదే విధంగా కొత్తూరు గ్రామంలో ఎస్సీ కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు.

గుంతను పూడ్చేదెన్నడో?



రోడ్డుపై ఉన్న గుంతలోకి చేరిన వర్షపు నీరు

అమరాపురం: మండల పరిధిలోని గౌడనకుంట గ్రామానికి వెళ్లే రహదారిలో తూము సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతలోకి వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు, పాదచారులు, ద్విచక్ర వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రోడ్డుపై ఉన్న గుంతకు మట్టి అయినా తోలాలని స్థానికులు కోరుతున్నారు. రహదారిపై ప్రయాణించాలంటేనే భయంగా ఉందని తెలిపారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని గుంతను పూడ్చాలని కోరారు.

నేడు 'వెన్నుపోటు' పుస్తకావిష్కరణ

చిలమత్తూరు: చంద్రబాబు ఏడాది పాలనలో జరిగిన వైఫల్యాలు, మోసాలను వివరిస్తూ రూపొందించిన ''వెన్నుపోటు'' పుస్తకాన్ని సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆవిష్కరించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఫెయిల్ అయ్యారని, ఆయన చెప్పిన ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఈ అంశాలన్నీ వెన్నుపోటు పుస్తకంలో ఉంటాయన్నారు. ఈ పుస్తకావిష్కరణకు నియోజకవర్గంలోని కన్వీనర్లు, నేతలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బాబురెడ్డి సంతాప సభ

వైఎస్సార్‌సీపీ పెనుకొండ మాజీ సమన్వయకర్త దివంగత చల్లాపల్లి బాబురెడ్డి సంతాప సభను పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నట్లు సమన్వయకర్త దీపిక పేర్కొన్నారు.

టెట్రా ప్యాకెట్లు స్వాధీనం

హిందూపురం టౌన్: హిందూపురం ఎక్సైజ్ పోలీసులు రహమత్‌పురం, ముదిరెడ్డిపల్లి సమీపంలో ఆదివారం దాడులు నిర్వహించి టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. కర్ణాటక మద్యం 154 టెట్రా ప్యాకెట్లు, 15 లీటర్ల విస్కీ ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని షేక్ అంజాద్, రాజగోపాల్, లక్ష్మన్నలపై ముగ్గురిపై కేసులు నమోదు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. అలాగే హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ముదిరెడ్డిపల్లి వద్ద మద్యం బెల్టు దుకాణం నిర్వహిస్తున్నారన్న స్థానికుల ఫిర్యాదు మేరకు తనిఖీలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు పృథ్వీ, ఫరూక్, నారాయణస్వామి, హెచ్‌సీలు నరసింహ, వెంకటేష్, రమణ, సతీష్, కానిస్టేబుళ్లు అంజి, సురేష్, రవీంద్ర, కుమార్, రంగదామా, శివ, సుధాకర్ రెడ్డి, ఉష్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



సభలో మాట్లాడుతున్న సీఐ సురేష్

పావగడ: ఆగస్ట్ ఒకటిలోగా ఆటోలకు సంబంధించిన ఎఫ్‌సీ, బీమా, పర్మిట్, యూనిఫాం ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా కలిగి ఉండాలని, లేకపోతే కేసు నమోదు చేసి ఆటోలను సీజ్ చేస్తామని పట్టణ సీఐ సురేష్ ఆటోడ్రైవర్లను హెచ్చరించారు. స్థానిక పాత ఎస్ఎస్‌కే కల్యాణ మంటపంలో తుమకూరు జిల్లా పోలీస్, మధుగిరి ఉప విభాగం, పావగడ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆటో డ్రైవర్ల సభలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయని, ఈ నేపథ్యంలో నిబంధనలు కఠిన తరం చేస్తున్నామన్నారు.

అనారోగ్యంతో ఆశా వర్కర్ మృతి



రంగమ్మ (ఫైల్)

రొళ్ల: మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధిలో పని చేస్తున్న ఆశా వర్కర్ రంగమ్మ (44) శనివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రొళ్ల సచివాలయం -1 పరిధిలో గత 15 ఏళ్లుగా ఆశావర్కర్‌గా రంగమ్మ పని చేస్తున్నారని తెలిపారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యతో పలు ఆస్పత్రుల్లో రంగమ్మ చికిత్సలు చేయించుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి మృతి చెందినట్లు పేర్కొన్నారు. రంగమ్మ మృతికి స్థానిక ఆశా వర్కర్లు సంతాపం తెలిపారు. ఆమె ఇంటి వద్దకు చేరుకుని మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. రంగమ్మకు భర్త తిప్పేస్వామితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు



అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెచ్చిన పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు ప్రసాద వినియోగం చేశారు.

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని కొలిచే గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.